క్లుప్తంగా


ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న ఎంఈఓ, తదితరులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని స్కూళ్లలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ పాఠశాల స్థాయిలో జరిగిన ప్రదర్శనలు తిలకించారు. ఈ నెల 30న మండల కేంద్రంలోని తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు



లక్ష్మీనరసింహస్వామి

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామికి విశేషపూజలు నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామికి నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చన నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంత సేవ గావించారు. ఈ సందర్భంగా స్వామి వారిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామిని పూజించారు. అర్చకులు భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

జనవరి 5 నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు



ప్రచార జాతాలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోం నందు యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల ప్రచార జాతను జెండా ఊపి శనివారం ఆయన ప్రారంభించారు. జనవరి 5, 6, 7వ తేదీల్లో కాకినాడలో మహా సభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, ఎస్‌హెచ్.రహమాన్, రవి ప్రకాష్, ఉత్తన్న, సుధాకర్, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ఎంపీ నిధులిస్తాం

–రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డిని కలసిన సర్పంచ్

పీలేరు: పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో ఎంపీని కలిసిన సర్పంచ్ హబీబ్ బాషా పీలేరు పంచాయతీలో సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పీలేరు పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సౌకర్యాల వివరాలు తీసుకురావాలన్నారు. ఎంపీ నిధులతో అభివృద్ధి చేయడానికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు అబీద తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

మదనపల్లె: ఇంటి పన్ను, నీటి ఛార్జీలు, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపునకు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 రెండో అర్ధ సంవత్సరానికి అపరాధ రుసుము లేకుండా ఇంటి పన్ను ఈ నెల 31వతేదీలోగా చెల్లించవచ్చన్నారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పన్ను చెల్లింపులు చేయవచ్చన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మేల్‌మరవత్తూరుకు తరలిన ఓం శక్తి భక్తులు



ఇరుముడితో తమిళనాడుకు బయలుదేరిన ఓంశక్తి భక్తులు

మదనపల్లె: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె, మట్లవారిపల్లెల్లో అమ్మవారి మాల ధరించిన భక్తులు తమిళనాడు మేల్‌మరవత్తూరు ఓంశక్తి ఆలయానికి బయలుదేరారు. ఈ నెలలో 3, 5, 11 రోజుల దీక్ష చేసిన భక్తులు 40 మంది ఇరుముడి కట్టుకుని శనివారం ఓంశక్తి అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. గురుశక్తి ఈశ్వరమ్మ నియమనిష్టలతో ఇరుముడి కట్టించారు.

పాలశీతలీకరణ కేంద్రం.. నిరుపయోగం

అధికారుల నిర్లక్ష్యం ఓ పాలశీతలీకరణ కేంద్రం నిరుపయోగంగా మారింది. పరికరాలు దుమ్ము పట్టిపోయినా వాటిని తరలించేందుకు చొరవ చూపకోవడం, పరికరాలకు దుమ్ము వదలకపోవడం వారి పనితీరుకు అద్దంపడుతోంది.

- వరికసువుపల్లె కేంద్రంలో దుమ్ము పట్టిన కంప్యూటర్లు
- పాల క్యాన్లు, పాల ట్యాంకర్, జనరేటర్ అధ్వానం
- కేంద్రం ఉందని పదేళ్లుగా గుర్తించని జిల్లా అధికారులు



వరికసువుపల్లెలోని పాల శీతలీకరణ కేంద్రం



నిరుపయోగమైన పాల ట్యాంకర్



దుమ్ముతో నిండిన ఎలక్ట్రానిక్ పరికరాలు

బి.కొత్తకోట: దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పల్లెల్లో పాల శీతలీకరణ కేంద్రాల(బీఎంసీయూ)ను ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పీలేరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో బీఎంసీయూలు ఏర్పాటుచేశారు. పాడి రైతుల నుంచి పాలను సేకరించి వారికి ఎక్కువ ధర ఇవ్వాలని నిర్ణయించారు. సేకరించిన పాలను విజయా డెయిరీకి తరలించేవారు.

2014లో మూత..

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బీఎంసీయూలు ఏర్పాటుకాగా, పెద్దతిప్పసముద్రం మండలంలోని వరికసువుపల్లెతోపాటు పెద్దతిప్పసముద్రంలో రెండు చోట్ల రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఏడేళ్లకుపైగా వరికసువుపల్లె కేంద్రం ద్వారా పాల సేకరణ జరిగింది. 2014 నుంచి పాల సేకరణ ఆగిపోవడం, కేంద్రానికి తాళం వేయడం జరిగిపోయింది. ఈ కేంద్రం ద్వారా పాలను సేకరించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలిగేది. స్థానికంగా పాల సేకరణతో రైతుల ఇబ్బందులు దూరం కావడమే కాకుండా మంచి ధర లభించేది. అధికారుల నిర్లక్ష్యమో, లేక ఇక్కడికి సమీపంలో ప్రయివేటు డెయిరీ ప్రభావమో ఇది మూత పడింది. ఎప్పుడు ఈ కేంద్రం మూతపడిందో అప్పటి నుంచి ఈ రోజు వరకు అలాగే ఉంది. అందులోని విలువైన సామాగ్రికి దుమ్ము పట్టింది. పాల క్యాన్లు, కొత్త జనరేటర్, కొత్త పాల ట్యాంకర్, కంప్యూటర్, స్కానర్, ప్రింటర్ అలాగే ఉంచేయడంతో దుమ్ము పట్టి ఉన్నాయి. వీటిని ఇక్కడికి తరలించి మరో కేంద్రంలో వినియోగించుకునే వీలున్నప్పటికీ ఏ అధికారి పట్టించుకోలేదంటే వారిపనితీరు అర్థమవుతోంది. కలెక్టర్ అయినా స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని అపమర్ధ ప్రభుత్వ పాలన రాష్ట్రంలో నడుస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని వాల్మీకిపురం పంచాయతీ పునుగుపల్లిలో స్థానిక కార్యకర్తలతో కలిసిన ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఎడాపెడా హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. నిత్యావసరాల నుంచి విద్యుత్ చార్జీల వరకు ధరలను ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ ప్రజల నెత్తిన పిడుగులాంటి భారం మోపుతోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే తాము గొప్పగా అమలుచేశామని డాబు చెప్పుకోవడం సీఎం చంద్రబాబుకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. హామీలపై ప్రశ్నించిన సోషల్ మీడియాపై అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. అనంతరం వాల్మీకిపురం పంచాయతీ పునుగుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పూల రెడ్డెప్ప తండ్రి పూల నరసింహులు ఇటీవల మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే చింతల రెడ్డెప్ప ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆనందరెడ్డి, బిడ్డల కేశవరెడ్డి, శ్యాంసుందర్, రఘు, రాజేష్, శ్రీనివాసులు, రామక్రిష్ణారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరాలయంలో శని త్రయోదశి పూజలు



శనేశ్వరస్వామి ఆలయంలో శనిత్రయోదశి పూజలు చేస్తున్న భక్తులు

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శనీశ్వరస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు నాగార్జున పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పలురకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి నువ్వులనూనె, నల్లని వస్త్రం, బెల్లం, నల్లనువ్వులు సమర్పించారు. భక్తులకు మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించే దిశగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి పట్టణంలోని 2, 3, 8, 10, 32, 34వ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. 35 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తూ, వారికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సంబంధించి సీటీఎం రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు కరీముల్లా, శివయ్య, నాయకులు నాగమణి, మధు, టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న పాలకుంట శ్రీనివాసులు

పీలేరురూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో నిర్లక్ష్యం తగదని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణికుమార్ అన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కలకడ మండలం ఏనుగొండపాళ్యం పంచాయతీ బండమీదపల్లె ఎస్సీ కాలనీకి చెందిన యాకల రెడ్డెప్పపై అదే గ్రామంలోని అగ్రవర్ణ కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్ర పరుష పదజాలంతో దూషించడం తగదన్నారు. ఈ నెల 19న దాడికి పాల్పడిన మహేష్ నాయుడు, ప్రసాద్ నాయుడు, వీరాంజనేయులునాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసి పది రోజులైనా ఇంత వరకు బాధితుడి కుటుంబాన్ని విచారించలేదన్నారు. పోలీస్ అధికారులు బాధితుడికి రక్షణ కల్పించడం తోపాటు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ఎర్రబల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, మాలమహానాడు నాయకులు జెట్టి దుర్గా ప్రసాద్, తుమ్మల రవిచంద్ర పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు



ఉత్సవ మూర్తులు

రాజంపేట టౌన్: పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో శనివారం రాత్రి శ్రీవారి భక్త సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. టీటీడీకి చెందిన వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. కల్యాణం జరుగుతున్నంతసేపు భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వ భావనలో ఉండిపోయారు. కల్యాణ ప్రాంగణం గోవింద నామ స్మరణతో హోరెత్తింది. రాజంపేట పట్టణం నుంచే కాక వివిధ గ్రామాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. నిర్వాహకులు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి భక్తులు బయట నుంచి స్వామివారి కల్యాణం తిలకించే ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి భక్తసేవా సమితి ప్రతినిధులు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణం ప్రారంభోత్సవానికి ముందు గీతా పారాయణం, అన్నమయ్య సంకీర్తన, కోలాటం, కూచిపూడి నృత్యం కార్యక్రమాలను నిర్వహించారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

తడబడుతూ.. పడి లేస్తూ

వర్షం కురిస్తే చాలు.. ఆ రహదారి చిత్తడిగా మారుతోంది. ఎర్రమట్టితో వర్షం నీరు చేరడంతో బురదమయమవుతోంది. దాదాపు 200 మీటర్ల మేర ఇలా ఉండడంతో బడి పిల్లలు భయపడిపోతున్నారు. చదువుకోవాలనే తపనతో బడికి వెళ్లే విద్యార్థులు నిత్యం పడుతూ లేస్తూ వెళ్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం పట్టించుకోవడంలేదు.

- మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే బురదలో ప్రయాణం
- విద్యార్థుల కష్టాలు పట్టించుకోని అధికారగణం



మోడల్ స్కూల్‌కు వచ్చిన ఓ విద్యార్థి తండ్రి ఇలా బురదలో వాహనాన్ని తోస్తూ వెళ్తున్నారు..

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు బడి సంచులు మోస్తూ జారి పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ స్కూల్‌లో మొత్తం 350 మందికి పైగా విద్యార్థులు నిత్యం చదువుకొనేందుకు వస్తున్నారు. వారిలో 250 మంది రోజూ ఇళ్లకు వెళ్లి బడికి వస్తున్నారు. మోడల్ స్కూల్ నుంచి మెయిన్ రోడ్డు వరకు సుమారు 200 మీటర్ల మేర మట్టి రోడ్డు ఉంది. దీనిపైనే విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వర్షం కురిస్తే ఈ రోడ్డులో నరకయాతన పడుతున్నారు. చాలా మంది పిల్లలను స్కూల్ వద్ద వదలి పెట్టేందుకు ద్విచక్ర వాహనాల్లో రావడం, బురద కారణంగా జారి పడిలేవడం పరిపాటిగా మారింది. పిల్లలు పడి లేస్తూ నానా అవస్థలు పడుతుంటే పట్టించుకునే నాథులే కరువయ్యారని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్ బాలికలకు తప్పని అవస్థ

స్కూల్‌లో వంద మంది బాలికలు చదువుతున్నారు. పక్కనే ఉన్న హాస్టల్‌లో ఉంటున్నారు. అయితే వారానికోసారి దూర ప్రాంతాల నుంచి తమ పిల్లలను పలకరించేందుకు వచ్చే తల్లిదండ్రులకు కష్టాలు తప్పడం లేదు. ఈ బురద రోడ్డులో భయంతో అడుగులు వేస్తూ నడవాల్సిన దుస్థితి. ఇలా ఉంటే ఎలా రాకపోకలు సాగిస్తారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యను దృష్టిలో పెట్టుకుని స్కూల్ నుంచి మెయిన్ రోడ్డు వరకు సిమెంటు రోడ్డు వేయించి పుణ్యం కట్టుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

45 రోజుల్లో భూ సమస్యలను పరిష్కరిస్తాం



చెంబకూరులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

రామసముద్రం: మండలంలోని చెంబకూరు పంచాయతీలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు నిర్మలాదేవి మాట్లాడుతూ సదస్సులో రైతులు తమ భూమి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి 42 అర్జీలు వచ్చాయని, వాటిని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, ఆర్‌ఐ వసీం అక్రమ్, తిప్పన్న, రామమూర్తి, రమణ, ఆర్.వెంకటేష్, నాగరాజ, చంద్రశేఖర్, బాబు, కృష్ణమూర్తి, ఆనంద్, నాగరాజస్వామి, రాజన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీ.పట్టాల కోసం వినతి

పెద్దమండ్యం: వారసత్వంగా సాగు చేసుకుంటున్న తమ భూములకు డీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని నక్కలవారిపేట, బత్తినగారిపల్లె రైతులు తహసీల్దారు సయ్యద్ అహ్మద్‌కు విన్నవించారు. మండలంలోని కోటకాడపల్లె సర్పంచ్ భూదేవి అధ్యక్షతన శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రైతులు, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పింఛన్లు, ఇతర సమస్యలపై కొందరు అధికారులకు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం వచ్చేలా చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె: ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామని తహసీల్దారు ఖాజాబీ అన్నారు. మండలంలోని సీటీఎం ఆర్వోబీ స్థలంలో శనివారం రైతులతో తహసీల్దారు మాట్లాడారు. ఖాజాబీ మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారిలో కొందరికి పరిహారం అందలేదన్న ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్వోబీ నిర్మాణానికి భూములు ఇచ్చిన అందరికీ పరిహారం తప్పక అందిస్తామని, పనులు అడ్డుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్ ఏఈ మంజుల, వీఆర్వో కల్యాణి, అధికారులు పాల్గొన్నారు.

జనవరి 5న ప్రసన్న రంగనాథస్వామి కల్యాణం

నందలూరు: రాజంపేట పట్టణంలోని తోట కల్యాణ మండపంలో రాజంపేట తిరుప్పావై భక్త సేవాసమితి ఆధ్వర్యంలో జనవరి నెల 5వ తేదీన గోదాదేవీ, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన సౌమ్యనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ రైల్వే ఆవరణలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుని విగ్రహానికి తైలాభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగ అవకాశాలను చేజార్చుకోవద్దు



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్: నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను చేజార్చుకోకుండా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక కాకతీయ విద్యా సంస్థల ఆడిటోరియంలో శనివారం ఆకేపాటి ఆధ్వర్యంలో ఎల్‌అండ్‌టీ సంస్థ జాబ్‌మేళాను నిర్వహించింది. జాబ్‌మేళాను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే సమయం వృథా చేయకుండా ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఎక్కడ ఉద్యోగం దొరికినా మరో ఆలోచన లేకుండా ఆ ఉద్యోగంలో చేరాలన్నారు. ప్రారంభ దశలో తక్కువ వేతనం ఉంటుందని, ఆ సమయంలో వేతనం గురించి ఆలోచించకుండా ఉద్యోగంలో చేరితే అనుభవం ద్వారా వేతనం పెరుగుతుందన్నారు. పిన్న వయస్సులో ఉద్యోగం వస్తే భవిష్యత్తు కూడా బాగుంటుందని తెలిపారు. ఉద్యోగం ఉంటే సమాజంలో గౌరవ, మర్యాదలు కూడా పెరుగుతాయన్నారు. చాలా మంది తమ చదువుకు తగ్గ వేతనం లేకుంటే ఉద్యోగంలో చేరకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని అది ఏమాత్రం సరైనది కాదన్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ రాజంపేటలో జాబ్‌మేళాను నిర్వహించి ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆకేపాటి, పోలా చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.శంకరయ్య, ఎ కాంతారావు, ధరణి నటరాజన్, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, సౌమిత్రి, దండు గోపి, దాసరి పెంచలయ్య, మలిశెట్టి శ్రీనివాసులు గౌడ్, నరేష్ పాల్గొన్నారు.





పొగమంచు కమ్మేసింది

గుర్రంకొండ పట్టణం పొగ మంచు సోయగాల ప్రకృతి రమణీయతలో తేలియాడింది. ఎన్నడూలేని విధంగా దట్టమైన పొగమంచు పట్టణాన్ని కప్పేసింది. శనివారం ఉదయం 8.30 గంటల వరకు పొగమంచు బిగి కౌగిలిలో పట్టణం బంధించబడింది. ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక పట్టపగలే లైట్లు వేసుకొంటూ నడిపారు. ఈ దృశ్యాలను పలువురు సెల్‌ఫోన్లలో బంధించారు. – గుర్రంకొండ